



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 21-05-2022 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 208 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా దావోస్

### దావోస్ కు పయనమైన సీఎం వైఎస్ జగన్







తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దావోస్ పర్యటనకు బయలుదేరారు. తాడేపల్లి నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి దావోస్‌కు పయనమయ్యారు. దావోస్ చేరుకోనున్నారు.

పర్యటనలో భాగంగా ఈనెల 22వ తేదీ నుంచి జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో సీఎం జగన్‌తో పాటు మంత్రులు, అధికారులు బృందం పాల్గొనున్నారు. ఏపీకి పెట్టుబడులను ఆకర్షించేందుకు దావోస్ కేంద్రంగా జరిగే వరల్డ్ ఎకానమిక్ ఫోరం తరువాయి 2లో..

### చంద్రబాబు ప్రైవేటు విద్యా సంస్థల మాఫియాను ప్రోత్సహిస్తే
## జగన్ ప్రభుత్వ బడులను ప్రోత్సాహిస్తున్నారు

- గుండె ఆపరేషన్ చేయించుకున్న నాగిరెడ్డికి చంద్రబాబు బెయిల్ రాకుండా చేశాడు

### ట్విట్టర్ వేదికగా చంద్రబాబుపై మండిపడ్డ ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి/విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ బడులను ప్రోత్స హించడం వల్లన విద్యార్థులు ఇంగ్లీషు భాషలో మంచి ప్రావీణ్యం చూపుతున్నారని వైఎస్ ఆర్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి కొనియాడారు.

శుక్రవారం పలు అంశాలపై ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు.

చంద్రబాబు నాయుడు నారాయణ లాంటి ప్రైవేట్ స్కూల్ మాఫియాను ప్రోత్సహిస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ బడులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో చదివితే మొద్దబ్బాయిలు అవుతారని చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆయన ఇంగ్లీష్ మీడియంలో చదివితే అందరూ మీ అబ్బాయి లోకేష్ లాగా మొద్దబ్బాయిలు కారని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపికి కేవలం 23 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలిచారని, ఇప్పుడెంతమంది చంద్రబాబు వెంట ఉన్నారో తెలుసుకొవలని హితవు పలికారు. గత ఎన్నికల్లో ఓడించిన ప్రజలు మూడేళ్లకే పిలుస్తున్నట్టు కలగంటున్నావా? చంద్రబాబు అంటూ ప్రశ్నించారు. అట్రాసిటీ కేసుతో భూమా నాగిరెడ్డిని బలి తీసుకున్న చంద్రబాబు కర్నూలు జిల్లా వెళ్లి నీతులు చెప్పడం ఏమిటని మండిపడ్డారు. గుండె ఆపరేషన్ చేయించుకున్న తరువాయి 2లో..

### వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ పోటీ చేస్తాం

**జనసేన అధినేత పవన్ కల్యాణ్**



చౌటుప్పల్: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ పోటీ చేయనున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణలో మూడో వంతు స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటిస్తున్నారు. జనసేనాని రాకతో అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఘనస్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కొంగరి సైదులు కుటుంబాన్ని పరామర్శించారు. కొంగర సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. జనసేన కార్యకర్తల బీమా పథకం ద్వారా సైదులు భార్యకు రూ.5 లక్షల చెక్కును పవన్ అందించారు. అనంతరం కోదాడలోని శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు.

పవన్ అక్కడే మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలోని ప్రతి తరువాయి 2లో..

### సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెదేపా

**తెదేపా అధినేత చంద్రబాబు**



అనంతపురం: మూడేళ్ల వైకాపా పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క పరిశ్రమ అయినా వచ్చిందా అని తెదేపా అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. కొత్తగా రాష్ట్ర యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో ప్రజలు ఒకసారి పరిశీలించాలన్నారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నారు. “అనేక సంక్షోభాలు ఎదుర్కొన్నాం. సంక్షోభాలు తెలుగుదేశం పార్టీకి కొత్త కాదు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే ఆశ ప్రజలందరిలో ఉంది. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెదేపా. తెదేపా హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తరువాయి 2లో..

### దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు.. చర్యలపై నిర్ణయం హైకోర్టుదే : సుప్రీంకోర్టు

దిల్లీ: దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కేసుపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలంగాణ హైకోర్టు నిర్ణయిస్తుందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఈ కేసును సుప్రీంకోర్టు ప్రత్యేకంగా మానిటర్ చేయలేదని.. తదుపరి విచారణ, తీసుకునే చర్యలను హైకోర్టు నిర్ణయిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ వ్యవహారంపై సిర్పూర్కర్ కమిషన్ సవివర నివేదిక ఇచ్చి పలు సూచనలు చేసిందని తెలిపింది. చట్ట ప్రకారం ఏం చేయాలో హైకోర్టు నిర్ణయిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. “హైకోర్టు, కింది స్థాయి కోర్టులో ఏం జరుగుతుందో తెలియదు.

మేం నివేదిక పంపుతాం.. దీనిపై హైకోర్టే నిర్ణయం తరువాయి 2లో..




## స్విమ్స్‌ను సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తాం




### - టీటీడీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

తిరుపతి (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిగారి ఆకాంక్షల మేరకు స్విమ్స్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్యసంస్థగా అభివృద్ధి చేస్తామని టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. స్విమ్స్ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం డాక్టర్స్ ఫర్ యు, హెచ్.డి.ఎఫ్.సి సంస్థలు రూ.5 కోట్ల వ్యయంతో విరాళంగా అందించిన అధునాతన వైద్యపరికరాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ సిఎం ఆదేశాలకు అనుగుణంగా స్విమ్స్‌కు తోడ్పాటును అందించాలనే ఉద్దేశంతో టిటిడిలో విలీనం చేసినట్టు చెప్పారు. దాతల సహకారంతో అన్ని విభాగాలలోను అధునాతన వైద్యపరికరాలను సమకూర్చనున్నట్టు తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన రూ.5 కోట్లు విలువైన వైద్యపరికరాలు విరాళంగా అందించిన తరువాయి 2లో..

# స్విమ్స్‌ను సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తాం

డాక్టర్స్ ఫర్ యు, హెచ్.డి.ఎఫ్.సి సంస్థల ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. వీటిలో ఐసీయూలో వెంటిలేటర్లకు సహాయంగా ఉండేందుకు, కోవిడ్ వ్యాధిగ్రస్తులకు ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచేందుకు 10 హై ఎండ్ మల్టీపారా మానిటర్లు, 20 మిడ్ రేంజ్ మల్టీపారా మానిటర్లు, 50 పల్స్ ఆక్సీ మీటర్లు ఉన్నాయన్నారు. అదేవిధంగా 10 వెంటిలేటర్లు, ఒక నియోనెటల్ వెంటిలేటర్, 100 ఫౌలర్ కోట్స్ ఆటోమేటిక్ విత్ మాట్రిసెస్, 25 డయాలసిస్ యంత్రాలు, 2 అల్ట్రాసౌండ్ యంత్రాలు తదితర వైద్య పరికరాలు విరాళంగా అందించినట్టు తెలియజేశారు. స్విమ్స్‌లో మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి జరుగుతోందని, ఇందులో భాగంగా ఇక్కడున్న 100 పడకల క్యాన్సర్ విభాగాన్ని 300 పడకలకు పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, దాతల సహకారంతో ఈ పనులు త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఉప ముఖ్యమంత్రివర్యులు కె.నారాయణస్వామి మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి బారినపడిన వారికి వైద్యసేవలు అందించడం ద్వారా స్విమ్స్ సంస్థ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. వైద్యసేవలతోపాటు వైద్య విద్య, వైద్య పరిశోధన, సామాజిక సేవ కార్యక్రమాలు అమలుపరచడంలో స్విమ్స్ ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలిపారు. ఈ అధునాతన పరికరాల ద్వారా మరింత మంది పేదరోగులకు అత్యవసర వైద్యం అందించవచ్చని చెప్పారు. తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎం.గురుమూర్తి మాట్లాడుతూ తాను కూడా ఈ కళాశాలలోనే చదువుకున్నానని, వైద్యులందరూ ఎంతో గొప్ప సంస్థగా భావిస్తారని అన్నారు. ఎంతో మంది పేద రోగులకు ఈ ఆసుపత్రి ఒక వరంలాంటిదన్నారు.

ఈ ఆసుపత్రి అభివృద్ధితోపాటు విమానాశ్రయం పక్కన గల స్విమ్స్ స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు.






తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు స్విమ్స్‌ను అత్యుత్తమ వైద్యవిద్యాసంస్థగా అంతర్జాతీయ ప్రమాణాలతో టిటిడి తీర్చిదిద్దుతోందన్నారు. ఇక్కడ అధునాతన వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలిపారు. అనంతరం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ విరాళ దాతలకు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. అతిథులను దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, డాక్టర్స్ ఫర్ యు సంస్థ డైరెక్టర్ డాక్టర్ రజత్ జైన్, హెచ్.డి.ఎఫ్.సి సంస్థ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పురాతన నాణేలు విశాఖ మ్యూజియంకు అప్పగింత







విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖ మ్యూజియంకు పురాతన నాణేలను నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నేతి వెంకట సూర్యనారాయణ మూర్తి శుక్రవారం అందించడం జరిగిందని జివిఎంసి అదనపు కమిషనర్ వై. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని లాసన్స్ బే కాలనీ కి చెందిన సూర్యనారాయణ మూర్తి ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్లేవారిని, 1961 నుంచి నాణేలను సేకరించడం హాబీగా చేసుకున్నారని, ఆయన ఏ ప్రాంతానికి వెళ్లినా అరుదైన నాణేలను సేకరించేవారిని, ప్రస్తుతం ఆయన వద్ద 50 దేశాలకు చెందిన 300 వరకు అరుదైన నాణేలు ఉన్నాయని తెలిపారు. వీటి చరిత్ర గూర్చి భావితరాల వారికి తెలిసేలా విశాఖ మ్యూజియంలో ఉండాలని ఆ నాణేలను అందజేశారు. ఈ నాణేలను విశాఖ మ్యూజియంలో జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాల ప్రకారం భద్రపరచడంతో పాటు, సందర్శకులకు దర్శనార్థం ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం క్యూరేటర్ శాంత కుమారి, జివిఎంసి కార్యదర్శి ఫణిరాం, మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ లో మరో ముందడుగు

మాధవధార (విజయభాను న్యూస్): అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం 'హెచ్. ఆర్. ఏ. ఐ'' రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో యువజన మరియు మహిళా విభాగాలలో కీలకమైన నియామకాలను చేపట్టింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు దువారపు. రామారావు, బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజు, వైకాపా రాష్ట్ర మహిళా నాయకురాలు పేడాడ రమణి కుమారి హాజరై నూతనంగా నియమితులైన రాష్ట్ర మరియు జిల్లా కార్యవర్గ మహిళ, యువజన విభాగాల సభ్యులకు నియామక పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా దావోస్

సమ్మిట్‌లో సీఎం జగన్ పాల్గొంటారు.

**రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా..**

ఈ సందర్భంగా.. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తలకు సీఎం జగన్ భేటీ కానున్నారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించనున్నారు. పారిశ్రామికీకరణ 4.0 దిశగా అడుగులపై దావోస్ వేదికగా కీలక చర్చలు జరగనున్నాయి. విశాఖ, కాకినాడ, కృష్ణపట్నంతో పాటు రాష్ట్రంలో నిర్మిస్తున్న పోర్టులు, కొత్తగా చేపట్టిన మూడు ఎయిర్‌పోర్టుల అభివృద్ధి ద్వారా నాలుగో పారిశ్రామికీకరణకు ఏ రకంగా దోహదపడుతుందో ఈ సదస్సులో వివరించనున్నారు. అటు.. బెంగళూరు-హైదరాబాద్, చెన్నై- బెంగుళూరు, విశాఖపట్నం- చెన్నై కారిడార్లలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను కూడా ఈ సదస్సు ద్వారా వివిధ పారిశ్రామిక సంస్థలు, వ్యాపారవేత్తల ముందు ఉంచనున్నారు. కరోనా వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ వివిధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించిన ప్రగతిని దావోస్ వేదికగా సీఎం నేతృత్వంలోని మంత్రులు, అధికారుల బృందం వివరించనుంది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను అధిగమించేందుకు చేసే ప్రయత్నంలో ఏపీ ప్రభుత్వం భాగస్వామం కానుంది. కాలుష్యం లేని పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి దిశగా అడుగులు వేయాలన్న కృత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందనే అంశాన్ని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో సీఎం బృందం వివరించనుంది.

సుస్థిర ఆర్థిక ప్రగతి లక్ష్యంలో భాగంగా ఇంటర్ కనెక్టివిటీ, రియల్ టైం డేటా, యాంత్రీకరణ, ఆటోమేషన్‌లకు పారిశ్రామికీకరణలో చోటు కల్పించాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. దీనిపై విస్తృతంగా జరిగే చర్చల్లో రాష్ట్ర బృందం పాల్గొననుంది. దావోస్ సదస్సులో వివరించే అంశాలతో ఏపీ పెవిలియన్ కూడా ఏర్పాటు చేసింది ప్రభుత్వం. పీపుల్-ప్రోగ్రెస్-పాజిబిలిటీస్ నినాదంతో ఈ పెవిలియన్ నిర్వహిస్తోంది. వాస్తవానికి ఈ సమ్మిట్ గత డిసెంబర్‌లో జరగాల్సి ఉంది. కరోనా కేసులు పెరగడంతో సమ్మిట్‌ను వాయిదా వేశారు.

## చంద్రబాబు ప్రైవేటు విద్యా సంస్థల మాఫియాను ప్రోత్సహిస్తే జగన్ ప్రభుత్వ బడులను ప్రోత్సాహిస్తున్నారు

నాగిరెడ్డికి బెయిల్ రాకుండా జైల్లో పెట్టింది నువ్వు కాదా? అని చంద్రబాబుని ప్రశ్నించారు.టిడిపి అధికారంలో ఉండగా ఐపిఎస్ లతో ఎమ్మెల్యేల ఫిరాయింపులు జరిపించి పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేసిందెవరు అని చంద్రబాబుపై మండిపడ్డారు. టిడిపి నేత అచ్చాన్న నాయుడు కు చెందిన పెద్దబమ్మిడి గ్రానైట్ క్వారీ నుంచి ఒకే పర్మిట్ తో 3 లోడ్లు గ్రానైట్ తరలించినట్టు విజిలెన్సు తనిఖీలో బైటపడిందని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వానికి 4.5 కోట్లు టోకర వేశారని వెల్లడించారు. 150 కోట్ల ఈఎస్ఐ స్కామ్ పై దర్యాప్తు జరుగుతున్నా నదురు బెదురు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నడని మండిపడ్డారు.

## వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ పోటీ చేస్తాం

నియోజకవర్గంలో జనసేనకు 5వేలకుపైగా ఓట్లున్నాయి. అయితే వాటితో గెలవలేం. కానీ.. కచ్చితంగా తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపిస్తుందని మాత్రం చెప్పగలను. తెలంగాణ రాజకీయాలను జనసేన శాసిస్తుంది. తెలంగాణలో జనసేన బలోపేతానికి పనిచేస్తాం. రాజకీయాల్లో దెబ్బతిన్న వాడిని కాబట్టి బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. జనసేన బలాలు.. బలహీనతలు నాకు బాగా తెలుసు. తెలంగాణలో ప్రతి జిల్లాలో.. ప్రతి గ్రామంలో జనసేన కమిటీలు ఏర్పాటు చేస్తాం. ఇక్కడ ప్రతి చోటా మాకు అభిమానుల అండ ఉంది. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే నిర్ణయాన్ని పార్టీ నేతలతో చర్చించి తీసుకుంటాం. తెలంగాణలో సామాజిక మార్పు కోరుకుంటున్నారు. ఆశయం కోసం నిలబడేవాడికి ఎప్పటికీ ఓటమి ఉండదు'' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సంపద సృష్టించడం తెలిసిన పార్టీ తెదేపా

ఎన్నో పరిశ్రమలు ముందుకొచ్చాయి. రాష్ట్రంలో పరిశ్రమలతో అనేక మందికి ఉపాధి కల్పించాం. వైకాపా పాలనలో పరిశ్రమల్లేవు.. యువతకు ఉద్యోగాలు లేవు. వైకాపా నేతల రౌడీయిజం చూసి రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు కూడా వెళ్లిపోయాయి. కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా రాలేదు'' అని చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు.

## దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు.. చర్యలపై నిర్ణయం హైకోర్టుదే

తీసుకుంటుంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వ్యవహారమిది. నివేదిక చూడకుండా కేసులో వాదనలు వినడం.. కేసును సుప్రీంకోర్టు నేరుగా పరిశీలించడం సాధ్యంకాదు. తెలంగాణ న్యాయవాదులు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి రావాలి'' ధర్మాసనం సూచించింది. మరోవైపు ఈ విచారణకు నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో సైబరాబాద్ సీపీగా వ్యవహరించిన వీసీ సజ్జనార్ హాజరయ్యారు.

## వి.ఎమ్.ఆర్.డి.ఏ. ప్రధాన కార్యాలయంలో నిర్వహించు స్పందనలో ఫిర్యాదులు స్వీకరించబడును

విశాఖపట్నం (విజయభాను న్యూస్) :

విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వి.ఎమ్.ఆర్.డి.ఏ.) కార్యాలయములో పట్టణాభివృద్ధి సంస్థకు సంబంధించిన విషయములపై ప్రజల నుండి అర్జీలు/ ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించు నిమిత్తం తేదీ. 23.05.2022 ఉదయం. 10.30 గం,, నుండి మధ్యాహ్నం 1.30 గం,, వరకు " స్పందన" కార్యక్రమం నిర్వహించుటకు నిర్ణయించడమైనది. వి.ఎమ్.ఆర్.డి.ఏ. స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా అర్జీలు/ ఫిర్యాదులను స్వీకరించి తగు ప్రతిస్పందనను తెలియజేయు నిమిత్తము అందరు శాఖాధిపతులు హాజరగుదురు. మరియు ప్రజల యొక్క అర్జీలు/ ఫిర్యాదులకు తగు రశీదును అందజేసి, నిర్ణీతకాలంలో ప్రతిస్పందనను తెలియ జేయబడును. ప్రతి సోమవారము (పనిదినాలలో) వి.ఎమ్.ఆర్.డి.ఏ. కార్యాలయము నందలి 3వ అంతస్తులో గల సమావేశ మందిరములో "స్పందన" కార్యక్రమము నిర్వహించబడును. ప్రజా సౌకర్యార్థం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సకాలంలో పరిష్కరించేందుకు గాను వి.ఎమ్.ఆర్.డి.ఏ. చేపట్టిన 'స్పందన' కార్యక్రమమును సద్వినియోగం చేసు కొనవలసినదిగా కోరడమైనది.

# లాప్రియో స్కోపిక్ ద్వారా కిడ్నీలో రాయి తొలగించిన సంగివలస ఏఎన్‌హెచ్ డాక్టర్స్




భీమునిపట్నం (విజయభాను న్యూస్) : వివిఎంసీ భీమిలీ జోన్ రెండవ వార్డ్ సంగివలస ఎ ఎన్ హెచ్ ఆసుపత్రిలో చేరిన పేషెంట్ కు కిడ్నీ లో రాయిని (78.8ఎంఎం) లాప్రియో స్కోపిక్ ద్వారా 12గంటలు కష్టపడి వైద్యుల టీం తీసివేసా మని డాక్టర్ ఎం. ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎఎన్ హెచ్ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డా.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. ప్రసాదరావు మాట్లాడుతూ ఇటీవలే కిడ్నీ లో స్టోన్ ఉన్న సీతారాం అనే పేషంట్ ఎఎన్ హెచ్ లో అడ్మిన్ అయ్యారనీ,ఆయనకు ఎక్స్ రే తీసి చూడగా కిడ్నిలో రాయి ఉన్నట్లు కనిపించందనీ,78.8 ఎం.ఎంగా ఉందనీ చెప్పారు. మత్తు వైద్య నిపుణులు అయిస్కాంత సాహెూ ఫేషెంట్ కు మత్తు ఇచ్చారు. డాక్టర్లు బృందం గెడ్డం శ్రీనివాసరావు ఇద్దరు డాక్టర్లు ఈ టీం లో 12గంటలు కష్టపడి లాప్రియో స్కోపిక్ ద్వారా రాయిని బయటకు తీసినట్లు చెప్పారు. ఆ రాయి ఏమైనా వేరే అవయవాలు కు తగిలిన చాలా ప్రమాదం ఏర్పడుతుందనీ,అలా జరగకుండా చాలా జాగ్రత్తగా టీం కూడా పనిచేసారనీ చెప్పారు. దాంతో ఫేషెంట్ కు కూడా ఇబ్బందిలేకుండా ఉందనీ ఆయన తెలిపారు. కొన్ని ఆసుపత్రిలలో ఆపరేషన్ చేసి కిడ్నీ లో రాయిని తీస్తారనీ, దాంతో ఫేషెంట్ చాలా సఫ్ఫర్ అవుతారనీ, అదే లాప్రియో స్కోపిక్ ద్వారా తీయడం వలన ఫేషెంట్ ఇబ్బందులు పడడం జరగదనీ చెప్పారు ఫేషెంట్ ఇక మీదట చాలా జాగ్రత్తగా ఉండాలనీ ,నీరు ఎక్కువగా తాగాలనీ చెప్పారు.ఫేషెంట్ సీతారాం మాట్లాడుతూ డాక్టర్లు మంచి తనంతోనే ఈ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాయనీ, లేకపోతే విశాఖపట్నం ఆసుపత్రిలో జాయిన్ అవుదామని అనుకున్నాననీ తెలిపారు.

డాక్టర్లు పలకరింపు,వారి ఆదరాభిమానాలు తోనే ఎఎన్ హెచ్ లో జాయిన్ అయ్యాననీ తెలిపారు. ఎఎన్ హెచ్ లో డాక్టర్లు కష్టపడి ఎంతో ఓపికతో 12గంటలు కష్ట పడి లాప్రియోస్కోపిక్ ద్వారా కిడ్నీలో స్టోన్ తీయడం సాధారణ విషయం కాదనీ చెప్పారు. సిబ్బంది కూడా మంచి పలకరింపులతో అందరినీ అభిమానించేవారనీ చెప్పారు.

# పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంచుతుంది

సబ్బవరం (విజయభాను న్యూస్): మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం గ్రంథాలయం లో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా శుక్రవారం స్కూల్ విద్యార్థులు లకు కథలు చేప్పడం (తెనాలి రామకృష్ణ కథలు) జరిగింది.సబ్బవరం సచివాలయం మహిళా పోలీస్ డిపీఎస్.నళీని పాల్గొని పిల్లలు ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం తెలుసుకుని విజ్ఞానం పెంచుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.వి.రమణ, విద్యార్థులు పారకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు



భీమునిపట్నం (విజయ భాను న్యూస్) : సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు భీముని పట్నం నియోజక వర్గంలోని ఆయన ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా తగరపు వలసలో నిర్వహించారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చోడి వినోద్, ప్రధాన కార్యదర్శి, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు శ్రీ గరే సదానంద నాయకత్వంలో, వారి ఆర్థిక సాయంతో తగరపువలస కూడలి లో భారీ కేక్ ను కత్తిరించి, బైక్ ర్యాలీ చేశారు. అంతకు ముందు బంగాళా మెట్ట మైదానంలో 5వేల మందికి అన్నదానం చేసి, 500 మందికి తమ అభిమాన హీరో చిత్రాలతో వున్న టి. షర్టు లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం, విశ్వ విఖ్యాత నటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు కి భారత రత్న ఇవ్వాలనీ జూనియర్ అభిమానులుగా సంతకాలు సేకరించి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. తమ అభిమాన నటుడు ఆశయాలకు అనుగుణంగా తామంతా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ వేసవి లో టాంకర్ తో ఉచితంగా రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నామన్నారు. కరోనాలో పేదలకు, అభాగ్యులకు అన్న దానం, వైద్య సాయం అందించామన్నారు.ఈ కార్యక్రమం లో జూ. ఎన్టీఆర్. ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు సురేష్, శంకర్, ఎరుసు సన్యాసి రెడ్డి, తమ్మిన శ్రీను, నరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కోనేంపాలెం సమీపంలో ఉన్న జగనన్న పాల సేకరణ కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుబాష్ శుక్రవారం ప్రారంబించారు. దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకర్రావు గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే మండలంలో ఆయా సర్పంచ్‌లు, ఎమ్‌పిటిసిలు, నాయకుల సమక్షంలో జగనన్న అముల్ పాల సేకరణ కేంద్రాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా అచ్యుతాపురం పాత పంచాయితీ కార్యాలయంలో అముల్ పాల వెల్లువ కేంద్రాన్ని సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే మడుతూరు గ్రామంలో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంబించారు.

అలాగే దుప్పితూరులో ఎన్‌ఆర్‌జిఎస్ పథకం ద్వారా మంచి నీటి చెరువు పనులు ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటూరు సంజీవ్, ఎమ్‌పిటిసి శనివాడ జువ్వలనాయుడు, వైసిపి నాయకులు తోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సారాయి త్రాగి మీ జీవితాలను పాడుచేసుకోవద్దు

## అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కె.రాము



పరివర్తన కార్యక్రమంలో అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ రాము మరియు గ్రామస్తులు

అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి మండలం పరిధిలో గల చిలకల గెడ్డ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పరివర్తన్ కార్యక్రమం అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కె.రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ కె. రాము మాట్లాడుతూ. మత్తుకు ఎవరు బానిస కాకూడదనీ, అలాగే గ్రామం లో నాటుసారా తయారీ చెయ్య కూడదన్నారు, నాటుసారా తాగి చాలా మంది చనిపోవడంతో వాళ్ళ కుటుంబం ఎంతో నష్ట పోతుందని సూచించారు, మేము చెపుతున్నది మీగురించి మీకుటుంబంగురించి గంజాయి కొన్న వారికీ, రవాణా చేసిన వారికీ కూడ కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపు



గాజువాక (విజయభాను న్యూస్ ): స్టీల్ ప్లాంట్ లో ఈ నెల 11 న సెక్టార్ 2 లో వున్న సి.ఐ.టి.యు కార్యాలయంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (వీసీసీ) ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ప్రారంభమయ్యింది. ఈ క్యాంపు 30 పిల్లలలతో ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు జరుగుతున్నది. పేపర్ తో బొమ్మలు తయారుచేయడం, డ్రాయింగ్ వేయించడంతో పాటుగా మ్యాజిక్ షో, టీమ్ గేమ్స్, కథలు, డాన్సు, పాటలు,పద్యాలు మొ..అంశాలను ఈ శిబిరా లలో పిల్లలు చేస్తున్నారు. దీనికి రోటరీ క్లబ్ విశాఖపట్నం, ఆసరా చారిటబుల్ సొసైటీ వంటి సంస్థలు, వ్యక్తులు సహకారం అందిస్తున్నారు. వారందరికీ పిల్లల తల్లితండ్రులు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ క్యాంపులో డ్రాయింగ్ పై రాజ్యలక్ష్మి శిక్షణ ఇచ్చారు. పిల్లలు శారీరక వ్యాయామంతో పాటు, సృజనాత్మకత, మానసికంగా ఉల్లాసంగా ఉండటానికి ఎంతో ఉపకరిస్తున్నాయని రాజ్య లక్ష్మి తెలిపారు . ఈ క్యాంపు కి స్తానిక ఐద్వా నాయకులు వేణు ,సుమ,పుష్య,విజయలక్ష్మి , అనురాధ,ప్రభ విమల, వాని,సీనియర్ వి సి సి మెంబెర్స్ ఐయిన షైనీ,రోషిని, అమృత, నవీన్,దిలీప్, తల్లిదండ్రులు సహకారం అందించారు.

# 29వవార్డును పర్యటించిన వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జీవీఎంసీ 29వ వార్డులో మార్నింగ్ వాక్ లో భాగంగా వార్డ్ కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు 29వ వార్డ్ పరిధిలో ఉన్న వెంకటేశ్వర నగర్ ,పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కోసం వాటి పరిస్కారం కోసం నేరుగా ప్రజల వద్దకు వెళ్లారు. వర్షాలు వల్ల వార్డులో పలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పొంగిపోయాయి రోడ్లు మీద కాలువలు నిండి చెత్త ఎక్కువగా చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని తెలియజేయగా వెంటనే శ్రీ ఉరికిటి నారాయణ రావు గారు సంబంధించిన అధికారులుకు వెంటనే సమస్య చెప్పగా వెంటనే సానిటరీ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించారు.ఈ విధంగా వెంటనే ప్రజలు సమస్యలు పై వెంటనే స్పందించిన 29వ వార్డ్ కార్పొరేటర్ శ్రీ ఉరికిటి నారాయణ రావు గారికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు పై కఠిన చర్యలు తీసుకోవాలి

## మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



అల్లూరి సీతారామరాజు జిల్లా. (విజయభాను) : డుంబ్రి గూడ మండల కేంద్రంలో స్థానిక విలేకరుల సమావేశంలో అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వం అరచక పాలనా సాగిస్తోందని అల్లూరి సీతారామ రాజు జిల్లా రంప చోడవరం వైసిపి ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ గత ఐదు సంవత్సరాలుగా డ్రైవర్ గా పని చేస్తున్న దళిత యువకుడ్ని అధికార దాహంతో ఎవరిని ఏమీచేసినా ప్రభుత్వం మాదే కదా అన్న దైర్యంతో దళిత యువకుడ్ని దారుణంగా హత్య చేశాడని ఆరోపణలు ఉన్నాయని ఈ హత్యకు బాధ్యులైన వైసిపి ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ బాబుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్బారావు,అరకు పార్లమెంట్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి మండ్యగురు స్వామి,మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ భాస్కరరావు, తెలుగూ యువత మండల ప్రధాన కార్యదర్శి కొర్ర రవి కుమార్ టీడీపీ నాయకులు త్రినాథ్,తులసీరావు, సింహాచలం,రాజు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.10,00,000/- విరాళం

అన్నవరం (విజయభాను న్యూస్): కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కోయంబత్తూరు కు చెందిన వి.సౌందర రాజన్ శ్రీమతి రాజలక్ష్మి లు రూ.10,,00,000/- విరాళమును దేవస్థానం ఏఈవో కృష్ణారావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో ఫిబ్రవరి 7వ తేదీన వి.సౌందర రాజన్ పేరున అన్నదానం జరిపించవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఏఈవో కృష్ణారావు అభినందించారు.

# విజయభాను సంపాదకీయం

## సాహితీ సిరి సినారె

నిరంతర కవి, విశ్వంభర నాథుడు, మనవతా మహనీయుడు, ఆధునిక మహాకవి, వక్త, సాహితీ పరిశోధకుడు, బహుభాషావేత్త, ప్రయోగ శీలి, ప్రసిద్ధ సినీ గేయ రచయిత ఇలా ఎన్ని పేర్లుగా పిలిచినా ఆయనే, మన సాహితీ దిగ్గజం సినారె.

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు అందరికి 'సినారె'గా సుపరిచితులు. సినారె గారి మొదటి పేరు సత్యనారాయణ రెడ్డి. ప్రాచుర్యంలో సింగిరెడ్డి నారాయణ రెడ్డిగా, సినారెగా ప్రసిద్ధికెక్కారు. ఆయన భార్య మరణానంతరం భార్య పేరు మీద సుశీల నారాయణ రెడ్డి సాహిత్య పురస్కారాన్ని ప్రారంభించిన సాహితీ సమదర్శి సినారె.

సినారె ఉస్మానియాలో ఉర్దు మీడియంలో బీఏ పూర్తి చేశారు.1954లో ఉస్మానియాలో ఎం.ఏ తెలుగు పూర్తిచేసి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో 'ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు-ప్రయోగములు' అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. సినారె గారికి చిన్నప్పటి నుండి కవిత్వం పట్ల ఆసక్తి ఎక్కువ. ఆరేడు తరగతుల వయసులోనే కవితలు రాశారు. అనేక జానపదాలు, హరికథలు, బుర్రకథలు వినిపించారు. సినారె తొలి రచన 1953లో 'నవ్వనిపువ్వు' ను రాశారు. అనేక గేయనాటికలను, గేయకవితలను, ఖండ కావ్యాలను, కవితాసంపుటాలను, విశిష్ట కావ్యాలను, వ్యాససంపుటాలను, దీర్ఘ కావ్యాలను రాసిన సాహితీ ఉప్పెన సినారె.

సినారె గారి 'విశ్వంభర' వచన కావ్యానికి 1988లో జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. 'మంటలూ -మానవుడు' అనే కవితాసంపుటానికి 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. బౌద్ధ కథగా 'నాగార్జునాసాగరం' పేరు పొందిన కథాకావ్యం. మాత్రాఛందస్సుకు ప్రాణం పోసిన గేయకావ్యం 'కర్పూ ర వసంతరాయలు' ఎనలేని ఖ్యాతిని పొందింది.'మధ్యతరగతి మందహాసం' కవితాసంపుటి వచనకవిత్వాన్ని బలోపేతం చేసింది. 'ప్రపంచ పదులు' వంటి విశిష్ట కావ్యాలను రాశారు.

'ప్రపంచ పదులు'లో..'చేతగాని తనముంటే జాతకాన్ని నిందించకునమ్మలేని సరుకుంటే అమ్మకాన్ని నిందించకు కలం రాయలేకుంటే కాగితాన్ని నిందించకు..' అంటూ చెప్పిన కవిత్వం అద్వితీయం.అలాగే గజల్ లో..'మబ్బుకు మనసే కరిగితే అది నీరవుతుందిమనసుకు మబ్బె ముసిరితే కన్నీరవుతుంది..'అని చెప్పిన కవితలు నేటికీ ఆదర్శవంతగా ఉన్నాయి. ఊపిరి ఉన్నంత వరకు ఆయన కవితావాహిని ఆగలేదు. కలం, గళం రెండు ఆయన అస్త్రాలు.

సినారె గారు1981లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, 1985లో అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా, 1989లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా, 1992లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారులుగా, 1993లో ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా- ఏ పదవిలో ఉన్నా ఆ పదవులకు వన్నె తెచ్చారు. 1962నుంచి సినీ ప్రస్థానం ప్రారంభించి సినీ గేయాలు రాయడం మొదలు పెట్టారు. 'గులేబకావళి కథ' సినిమాలో 'నన్ను దోచుకుందువటే... వన్నెల దొరసాని..' అనే పాటతో పాటు ఆ సినిమాకు అన్ని పాటలు రాశారు. 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాల వరకు మొత్తం మూడువేల వరకు పాటలు రచించి సాహిత్య వాణిగా మిగిలి పోయారు.

'గున్నమామిడీ కొమ్మమీద...గూళ్ళు రెండున్నాయి..'
'పగలే వెన్నెలా... జగమే ఊయలా..'
'వస్తాడు నా రాజు ఈ రోజు..'
'అమ్మను మించి దైవం ఉన్నదా..'
'కంటేనే అమ్మ అని అంటే ఎలా..'
'జేజెమ్మా..... మాయమ్మ..' అంటూ అద్భుత పాటలు సినారె కలం నుండి
జాలువారిన సాహిత్య చంద్రికలు.

జ్ఞానపీఠ్ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులతో పాటు సినారె ఎన్నో పురస్కారాలను పొందారు. 1977లో పద్మశ్రీ, 1992 లో పద్మభూషణ్ అందుకున్నారు. రాజ్యలక్ష్మీ పురస్కారం, సోవియెట్ నెహ్రూ పురస్కారం, కళాప్రపూర్ణ, సినీకవిగా నంది పురస్కారం, పలు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్‌లను అందుకున్నారు. 2014లో జీవన సాఫల్య పురస్కారం పొందారు.

సినారె గురించి కుందుర్తి గారు 'తిలక్ లాగా రెండంచుల పదును గల కత్తి సినారె..' అని చెప్పారు. తాపి ధర్మారావు 'సినారె' గారిని మహాకవిగా ప్రశంసించారు. ఆయన తన సొంత ఊరిలో తన ఇంటిని గ్రంథాలయానికి ఇవ్వడం, పాఠశాల భవనం నిర్మించడం, కళా మందిరాన్ని, కళ్యాణ మండపాన్ని కట్టించడం వంటి సేవా గుణాన్ని కలిగిన సామాజిక సేవకుడు సినారె.

# మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి కుటుంబ సభ్యులను పరామర్శించిన ధర్మాన



కురుపాం (విజయభాను న్యూస్): మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి మామ శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్. చినమేరంగి కోటకి శుక్రవారం మధ్యాహ్నం పాలకొండ ఎమ్మెల్యే కళావతి తో కలిసి వెళ్లిన కృష్ణదాస్ అతని కుమారుడు పరీక్షిత్తు రాజును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



# అనకాపల్లి రోడ్డు ప్రమాదంలో డీటీ సతీష్ మృతి

- అంకిత భావం కలిగిన ఉద్యోగిని కోల్పోయాం
- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ సంతాపం





శ్రీకాకుళం (విజయభాను న్యూస్) : డిప్యూటీ తహశీల్దార్ సతీష్ శుక్రవారం వేకవజామున అనకాపల్లి జిల్లా ఏలేరు కాలువ శంకరం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శ్రీకాకుళం తాసిల్దార్ వెంకట్రావు, మరో డీటీ శ్రీహరి, జేసి సిసి శ్రీకాంత్, విశాఖపట్నం సర్వేయర్ సూర్య భగవాన్ లకు గాయాలయ్యాయి. వీరు ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనం శుక్రవారం వేకువజామున నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి గోడను ఢీ కొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో డ్రైవర్ సహా ప్రయాణిస్తున్న ఏడుగురిలో సతీష్ మృతి చెందగా మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా విజయవాడ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. విజయవాడలో శాఖాపరమైన పనుల నిమిత్తం వీరు మొదట శ్రీకాకుళంలో బయల్దేరి విశాఖపట్నం చేరుకున్నారు. అక్కడ ఎండాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద వారి వాహనాన్ని నిలిపి వేసి మరో వాహనంలో విజయవాడ బయల్దేరారు. అనకాపల్లి-సబ్బవరం రోడ్డులో వీరు వెళ్తున్న వాహనంతో ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయాలని ప్రయత్నించే క్రమంలో వాహనం పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ఆ సమయంలో కారు డోర్ తెరుచుకోవడంతో సతీష్ రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. క్షత్ర గాత్రులను స్థానికులు విశాఖలోని అపోలో అసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరేలోగానే సతీష్ మృతి చెందారని వైద్యులు స్పష్టం చేశారు.

**అంకితభావం గల ఉద్యోగి సతీష్...**

డిప్యూటీ తహశీల్దార్ సతీష్ ఎంతో అంకితభావం కలిగిన ఉద్యోగి అని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గత రెండు దశాబ్దాలుగా డిటీ సతీష్ తో తనకు వ్యక్తిగత అనుబంధం ఉందని, ఆయన ఇప్పుడు లేరంటే ఆ విషాదాన్ని జీర్ణించు కోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు తనకు ప్రోటోకాల్ విధులు ఆయనే నిర్వర్తించారన్నారు. విధినిర్వహణలో అంకిత భావంతో, క్రమశిక్షణతో ఎంతో గౌరవాన్ని పెంచేలా జిల్లాకు గవర్నర్, సీఎం, మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ప్రోటోకాల్ బాధ్యతలు నిర్వహిస్తూ ఎందరికో ఆప్తునిగా నిలిచారన్నారు. ఆయన మృతి చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. క్షత్రగాత్రులు త్వరగా కోలుకోవాలని మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆస్పత్రి వైద్యులతో కృష్ణ దాస్ మాట్లాడారు.



**మధుసూదన నగర్ లో వేంచేసి వున్న శ్రీ లక్ష్మి గణపతి సహిత శ్రీ కనకదుర్గ అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 19 న కలశ ప్రతిష్ట తో ప్రారంభమైన ఉత్సవాలు 22తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం భక్తులు తమ స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సహస్ర కుంకుమార్చన లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కార్యక్రమంలో మధుసూదన నగర గ్రామ సేవా సంఘం అధ్యక్షులు కలిమి రెడ్డి అప్పారావు, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయం కమిటీ చైర్మన్ శ్రీరంశెట్టి శంకర్, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.**


# స్విమ్స్ కు రూ.5 కోట్లు విలువైన వైద్యపరికరాలు విరాళం



తిరుపతి (విజయభాను న్యూస్ ) : అందరికీ ఆరోగ్యం అందించేందుకు, మానవ సేవే మాధవ సేవ అన్న నినాదంతో వైద్యులు, వైద్య విద్యార్థులు, భావసారూప్యత గల వ్యక్తులతో 2007వ సంవత్సరంలో డాక్టర్స్ ఫర్ యు అనే సంస్థ ఏర్పాటైంది. భారతదేశంలో విపత్తులు, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు మానవతా దృక్పథంతో వైద్య సహకారం అందించడం, వైద్యపరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ఈ సంస్థ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2010వ సంవత్సరంలో ప్రతిష్ఠాత్మక సార్క్ అవార్డు, 2011వ సంవత్సరంలో ద బ్రిటీష్ మెడికల్ జర్నల్ గ్రూప్ అవార్డు దక్కాయి. వైద్య సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్స్ ఫర్ యు సంస్థ, కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా హెచ్.డి.ఎఫ్.సి సంస్థ పేద రోగులకు వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ ఆసుపత్రిని ఎంపిక చేసుకుని రూ.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందించారు. డాక్టర్స్ ఫర్ యు సంస్థ డైరెక్టర్ డాక్టర్ రజత్ జైన్ గారు, హెచ్.డి.ఎఫ్.సి సంస్థ ఉపాధ్యక్షులు శ్రీ శ్రీకాంత్ రెడ్డి గారు, డాక్టర్ భాటియ ఇనిస్టిట్యూట్ ఫ్రాంచైజీ అయిన డాక్టర్ ఇంద్రసేన, డాక్టర్ సురేంద్ర రెడ్డిగారి సమన్వయ సహకారంతో కోవిడ్ మహమ్మారిని నియంత్రించేందుకు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్య పరికరాలను అందించడం జరిగింది. కేవలం మూడు నెలల కాల వ్యవధిలో ఈ పరికరాలను సమకూర్చుకోవడం జరిగింది. ఐసీయూలో వెంటిలేటర్లకు సహాయంగా ఉండేందుకు, కోవిడ్ వ్యాధిగ్రస్తులకు ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచేందుకు 10 హై ఎండ్ మల్టీపారా మానిటర్లు, 20 మిడ్ రేంజ్ మల్టీపారా మానిటర్లు, 50 పల్స్ ఆక్సీ మీటర్లు ఉన్నాయి. అదేవిధంగా 10 వెంటిలేటర్లు, ఒక నియోనెటల్ వెంటిలేటర్, 100 ఫౌలర్ కోట్స్ ఆటోమేటిక్ విత్ మాట్రిసెస్, 25 డయాలసిస్ యంత్రాలు, 2 అల్ట్రాసౌండ్ యంత్రాలు తదితర వైద్య పరికరాలు ఉన్నాయి.

# పోర్టు అథారిటీ, కస్టమ్స్ మరియు మెస్సర్స్ స్మిత్ డిటెక్షన్ సంస్థల మధ్య త్రైపాక్షిక ఒప్పందం

## - కంటైనర్ స్కానర్ కు చెందిన ఆస్తులన్ని నిర్వహణ నిమిత్తం కస్టమ్స్ విభాగానికి బదిలీ చేయబడతాయి



విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ (విజయభాను న్యూస్): విశాఖపట్నం పోర్టు అథారిటీ, కస్టమ్స్ మరియు మెస్సర్స్ స్మిత్ డిటెక్షన్ సంస్థల మధ్య త్రైపాక్షిక ఒప్పందం పైన శుక్రవారం విశాఖపట్నం పోర్టు కార్యనిర్వాహక కార్యాలయంలోని బోర్డు రూమ్ లో సంతకాలు జరిగాయి. ఒప్పందంలో భాగంగా కంటైనర్ స్కానర్ కు చెందిన ఆస్తులన్నీ నిర్వహణ నిమిత్తం కస్టమ్స్ విభాగానికి బదిలీ చేయబడతాయి. విశాఖపట్నం పోర్ట్ తరపున డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్, కస్టమ్స్ విభాగం తరపున వి. శ్రీనివాసరావు,ఐ ఆర్ ఎస్ కస్టమ్స్ కమిషనర్, మేస్సర్స్ స్మిత్ డిటెక్షన్ సంస్థ తరపున ఆ సంస్థ ఎండీ విక్రంత్ సుభాష్ త్రిలోకేకర్ లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సులభతర వాణిజ్య విధానాన్ని అమలు చేయడంలో భాగంగా కేంద్ర షిప్పింగ్ నౌక మరియు జల రవాణా శాఖ అన్ని మేజర్ పోర్టులలో సరుకు రవాణా చేయడానికి తీసుకుంటున్న సమయాన్ని గణనీయంగా తగ్గించాలని నిర్ణయించింది. మేజర్ పోర్టులలో దిగుమతులకు సంబంధించిన అనుమతుల వ్యవహారాలను మరింత సులభతరం చేసేందుకు కంటైనర్ స్కానర్ ఏర్పాటు అనేది సులభతర వాణిజ్య విధానం లో అతి ముఖ్యమైన అంశం. కేంద్ర షిప్పింగ్, పోర్ట్ మరియు జల రవాణా మంత్రిత్వ శాఖ తరపున ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ 8 మొబైల్ కంటైనర్ స్కానర్ లను సమకూర్చింది. కంటైనర్ స్కానర్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు కోసం విశాఖపట్నం పోర్టు అథారిటీ 29.6 8 కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టింది. ఇందులో స్కానర్ కు సంబంధించిన పరికరాలు కూడా ఉన్నాయి. సాధారణ స్కానింగు వేగం తో పోల్చుకుంటే ఈ కంటైనర్ స్కానర్ గంటకు 20 కంటైనర్లను స్కానింగ్ చేయగల సామర్థ్యం కలిగి ఉంది. సెప్టెంబర్ 2, 2021 న కంటైనర్ స్కానర్




ఏర్పాటు చేశారు.

ఈ త్రై పాక్షిక ఒప్పంద కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అధికారులు కస్టమ్స్ అధికారులు మరియు మిస్టర్ స్మిత్ డిటెక్షన్ గ్రూపు కు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## డివీస్ ఆధ్వర్యంలో చుట్టు ప్రక్కల పంచాయతీ లో ఉన్న మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో టైలరింగ్ జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణా



భీమునిపట్న (విజయ భాను న్యూస్): భీమిలి మండలం చిప్పాడు గ్రామంలో ఉన్న దివిస్ యాజమాన్యం వారు చుట్టు ప్రక్కల గ్రామాల లో ఉన్న మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వద్ద జ్యూట్ బ్యాగ్ లు కుట్టుటకు 40 రోజులు పాటు ట్రైనింగ్ ఇచ్చారు. వారిలో ఉత్సాహ వంతులైన 6 గురు మహిళలు వారి కాల పై నిలబడి కుటుంబ పోషణలో భాగ స్వాములు మారేటట్టు ప్రోత్సహించి సొంతంగా షాప్ పెట్టిన వారికి ప్రోత్సహం నందించారు. శుక్రవారం సిటినగర్ లో ఆరుగురు సభ్యుల బృందం తమ కలను సాకారం చేసుకుంటూ మొదలు పెడుతున్న షాప్ ను దివిస్ జీ ఎం వై ఎస్ కోటేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ చుట్టు ప్రక్కల గ్రామీణ మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ఎన్నో కోర్సులు ఏర్పాటు చేసి వారికి వివిధ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను నిర్వ హిస్తున్నామని అన్నారు.మా సంస్థ ద్వారా టైలరింగ్ జ్యూట్ బ్యాగ్ లలో ట్రైనింగ్ పూర్తి చేసి వారే సొంతంగా షాప్ ఏర్పాటు చేసుకోవడం చాలా శుభదాయక పరిణామం అని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలకు దివిస్ సంస్థ ఎల్లప్పుడు ప్రోత్సహం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ ప్రతినిదులు డి సురేష్ కుమార్, శ్రీ నాగరాజు ,పిశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం
## 23 రోజులకు రూ.1.16 కోట్లు



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు ను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ శుక్ర వారం నిర్వహించారు.

గడచిన 23 రోజులకు గాను సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం రూ.1,16, 78,368/-(ఒక్క కోటి,పదహారు లక్షల,డభై ఎనిమిది వేల,మూడువందల అరవై ఎనిమిది రూపాయలు) రాగా బంగారం 37 గ్రాములు, వెండికేజీ 140 గ్రాములు లభ్యం కాగా విదేశీ కరెన్సీ యుయస్ఏ డాలర్లు 197,సింగపూర్ డాలర్లు 31,సౌదీ అరేబియా 172 రియాల్స్ తో పాటు కొంత విదేశీ ద్రవ్యము లభ్యమయ్యాయి.ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు, చైర్మెన్ ఐ.వి.రోహిత్,ఏసి రమేష్ బాబు,పిఆర్వో కొండలరావు మరియు...

దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు, అర్చకులు, నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ వారి ఆలయంలో ఘనంగా చండీ హెూమం



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్న వరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శు క్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం,అమ్మవారికి మూల,మంత్ర జప ములు,సప్తపతి పారా యణవ ులు నిర్వహిం చారు.11 గం.లకు పూర్ణహుతి గావిం చారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కోట.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చల్లపల్లి.ప్రసాద్ శర్మ, చిట్టెం.వాసు,చిట్టెం.నగేష్,కూచిబట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు,అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది,భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదములు అందజేశారు.

## నాటు సారాయి తయారు చేసి ప్రజల జీవితారతో ఆడుకోవద్దు
### అనంతగిరి యస్ఐ కె.రాము, యస్కోట యస్ఐ లోవరాజు




అనంతగిరి, విజయభాను, న్యూస్ : అనంతగిరి పోలీస్ స్టే షన్,. యస్,ఐ, కె,రాము మరియు ఎస్.కోట పోలీస్ స్టేషన్,. యస్,ఐ, లోవరాజు గార్లు మరియు సిబ్బంది తో కలిసి బోర్డర్ ఏరియా అయిన చిలకలగెడ్డ పంచా యతీ, జీలుగులపాడు గ్రామ చివర అయిన కాలువ గెడ్డ దగ్గర రైడ్ చేసి, సుమారు 1000 లీటర్లు నాటుసారా పులుపు ధ్వంసం చేసి గ్రామస్థులకు నాటు సారా తయారు చేసిన, అమ్మిన, రవాణా చేసిన,చట్ట రీత్యా చర్యలకు బాధ్యులు అవుతారని తెలియజేయడం అయినది.

## వమ్మి అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ 39వ జన్మదినోత్సవ వేడుకలు



అన్నవరం (విజయభాను న్యూస్) :విశాఖ సిటీ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వమ్మి అప్పారావు ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ 39వ జన్మదినోత్సవ వేడు కలు శివాజీ పాలెంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కేక్ కట్ చేసి నందమూరి అభిమానులు అందరికీ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బైరెడ్డి పోతన రెడ్డి, 17 వ వార్డు అధ్యక్షులు కాళ్ల శంకర్, బొట్ట వెంకటరమణ, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత
## ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుంది
### బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మంత్రివర్గంలో 77 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం మంత్రి వేణుగోపాల కృష్ణను వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఇటీవల రామేశ్వరం రామనాథేశ్వరుని కుటుంబసమేతంగా సందర్శించుకుని వచ్చిన సందర్భంలో మంత్రికి రామనాథేశ్వరుని ప్రసాదాన్ని అందచేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల ద్వారా పేదల బిడ్డలను విద్యావంతులుగా తీర్చిదిద్దడం, సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసి రాజ్యాధికారం కల్పించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్మోహన్ రెడ్డి సముచిత ప్రాధాన్యం కల్పించారని ప్రశంసించారు.ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న సామజిక న్యాయభేరి పేరిట నిర్వహిస్తున్న బస్సు యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మూడేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక న్యాయాన్ని ప్రజలకు వివరించి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ కూడా ఉన్నారు.

## గిరిజనులకు వైద్యం దూరం చేసే యోచనలో ప్రభుత్వ నిర్ణయం
## ఏజెన్సీలో 4 ఖాళీలు చూపడమే ఇందుకు నిదర్శనం





అల్లూరిజిల్లా :విజయబాను) పాడేరు: : అల్లూరి సీతారామరాజు జిల్లాపాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గత 25 సంవత్సరాలుగా పని చేస్తున్నా 125 మంది రెగ్యులర్ ఏఎన్ ఏం లను సచివాలయంలో సర్దుబాటు పేరుతో మైదాన ప్రాంతానికి తాత్కాలిక బదిలీలు చేపట్టడం వలన గిరిజన ప్రాంతంలోని అతిమారుమూల గ్రామాలకు ఏ ఎన్ ఏం ల ద్వారా ఆందేటువంటి మాతా శిశు సేవలు, మలేరియా, డయేరియా, కోవిడ్ వంటి సేవలు గిరిజన ప్రజానీకానికి అందకుండా పోతుందని, కావునా తక్షణమే ప్రభుత్వము ప్రభుత్వ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని గిరిజన ప్రాంత వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు శెట్టి. నాగరాజు పత్రికా ముఖంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆయన శుక్రవారం

నాడొక ప్రకటన విడుదల చేస్తూ..గిరిజన ప్రాంతంలోని ఉద్యోగులను సాధారణ బదిలీల సమయంలో మైదాన ప్రాంతానికి ఇవ్వండి అని అడిగితే జీవో నెంబర్ 68 అడ్డుగా ఉందని, జీఓ నెంబర్ 68 ప్రకారంగా గిరిజన ప్రాంతంలోని ఉద్యోగులకు గిరిజన ప్రాంతం లోనే ప్రమోషన్లు కల్పించాలని సూచిస్తుందని, జీవో నెంబర్ కి వ్యతిరేకంగా, గిరిజన ప్రాంత గిరిజన ఉద్యోగులను మైదాన ప్రాంతానికి బదిలీ లు గానీ, ప్రమోషన్లు గానీ, ఇవ్వలేమని చెప్పే జిల్లా అధికారులు ఇప్పుడు సచివాలయంలో తాత్కాలిక సర్దుబాటు కోసమని 25 సంవత్సరాలుగా పని చేస్తున్నా 125 రెగ్యులర్ ఏ ఎన్ ఏం లను, ఎటువంటి ప్రమోషన్లు ఇవ్వ కుండా మైదాన ప్రాంతానికి తాత్కాలిక బదిలీలు ఎలా చేపడతారని.అధికారులకు ప్రశ్నించారు. అధికారులు తీసు కొన్న చర్య వలన గిరిజన ప్రాంతంలోని మారుమూల గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందకుండా పోతుందని, గతంలో ఒక ఆరోగ్య కేంద్రం పరిధిలో ముగ్గురు సిబ్బంది పని చేస్తుంటే నేడు ఇద్దరు మాత్రమే పని చేస్తున్న తరుణంలో వారిలో ఇంకో ఒక్కరిని మిగిల్చి మిగిలిన వారిని మైదాన ప్రాంతానికి బదిలీ చేపట్టడం దారుణమైన విషయం అని, ఒక్కొక్క సచివాలయం లేదా ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు వేల నుండి 5000 జనాభా ఉన్న మారుమూల గ్రామాల్లో మాతా శిశు సంరక్షణ మలేరియా డయేరియా, కోవిడ్, గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందకుండా ప్రభుత్వం అన్యాయం చేసినట్లు అవుతుందని,ఆవేదన వ్యక్తంచేశారు.

## పరవాడ సిఐ పెదిరెడ్లకు చిరు సత్కారం



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ సిఐ పెదిరెడ్ల ఈశ్వరావు కు శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి ఉత్సవ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# గడపగడపకు వైసీపీ కార్యక్రమం

- ఇది ఒక్క భారీ దగా కార్యక్రమం - సామాన్య ప్రజలకు చాలా చా లా మోసం చేసే కార్యక్రమం
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. గిరిజన హక్కులు చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు
- వైసిపి కార్యకర్తలు నాయకులు ప్రజా ప్రతినిధులు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాచిపెంట శాంతకుమారి డిమాండ్



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) : మండలం కేంద్రం లోగల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు అరకు పార్లమెంట్ డిస్ట్రిక్ట్ ఇన్చార్జి. పాచిపెంట శాంతకుమారి రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన గడప గడప కార్యక్రమం ఇది ఒక దాగా కార్యక్రమం అన్ని విమర్శించడం జరిగింది గిరిజనులకు బడుగు బలహీన వర్గాలకుఎటువంటి మేలు జరగా లేదు వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం ఏర్పడి సుమారు మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ నిరుద్యోగులకు ఒక జాబ్ నోటిఫికేషన్ తీసిన దాఖలు లేదు ప్రత్యేక హెూదా సాధించడంలో విఫలమయ్యారు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశం లో తాకింది కొనేటట్టు లేదు తినేటట్టు లేదు అన్న రీతిలో ఉంది రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి .గిరిజనుల గుండెకాయ లాంటి జీవో నెంబర్ 3ను. చట్టబద్ధత కల్పించకుండా పూర్తిగా విఫలమయ్యారు . జిఓ నెంబర్ 3ను చట్టబద్ధత కోసం గిరిజన వైఎస్ఆర్సిపి నాయకులు ఎందుకు నోరుమెదపడం లేదు అర్థం కావట్లేదు . మారుమూల ప్రాంతం గిరిజన గ్రామాలకు మండల కేంద్రాల నుండి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించడం లో విఫలమయ్యారు గుంటసీమ బస్సు పట్టం బస్సు.గోమంగిబస్సు. కామయ్య పేట బస్సు మరి. అనేక.చోట్ల బస్సులు సౌకర్యం లేక రోడ్డు సౌకర్యం లేక మంచినీటి సౌకర్యం లేక గిరిజనులు చాలా అవస్థలు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుబెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కొనసాగించకుండా గిరిజన విద్యార్థులకు విద్యను అందించడంలో విఫలం అయ్యారు స్పెషల్ డిఎస్సి తీయకుండా నిరుద్యోగులకు నిలువు దోపిడీ మోసం చేశారు అదేవిధంగా భాష వాలంటీర్లను రెన్యువల్ చేయకుండా వారి కుటుంబాలకు రోడ్డున పడేశారు ఆశ్రమ పాఠశాల లో పని చేస్తున్నటువంటి హెల్త్ వాలంటీర్లను రెన్యువల్ చేయకుండామోసం చేశారు వీటికి సమాధానం ఎవరి వద్ద ఉంది వైసీపీ కార్యకర్తలు నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు మీయొక్క కుటుంబాలు పిల్లలకు ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయి ఈ ప్రశ్నల మీద మీరు ఆత్మపరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ. నుండి డిమాండ్ చేస్తున్నాం ఎన్ని రకాల సమస్యలు ఉన్నప్పుడు మీరు ఇంకా ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడానికి గడపగడపకు కార్యక్రమం చేపట్టడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తున్నాం వైసిపి కార్యకర్తలు నాయకులు కళ్ళు తెరిచి గిరిజనుల కోసం పని చేయండి హక్కులు చట్టాల కోసం గిరిజనుల భవిష్యత్ తరాల కోసం పని చేయండి. అని ఈ సందర్భంగా. పాచిపెంట శాంతకుమారి ఆవేదన వ్యక్తం చేశారుఈ క్రమంలో అరకు వేలి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సెట్టి భగత్ రాం. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి మజ్జి అద్దు. పార్టీ నాయకులు. గోల్లోరి వెంకట్రావు. గోల్లోరి ధనుంజయ్. తెడబారికి భీమారావు. కుమిడిశెట్టి మోహన్ రావు మహిళా నాయకురాళ్లు పాచిపెంట. ధనలక్ష్మి పాచిపెంట మాలతి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డును సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దటమే లక్ష్యం
## జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వార్డు ప్రజల సమస్యలు తీరుస్తూ వార్డును సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగు తున్నట్లు జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు.శుక్రవారం వార్డు పరిధి అల్లిపురం నేరెళ్ళకోనేరు ఉత్కల్ యువ సేవా సమాజ్ దగ్గర ప్రజలందరికీ ఉపాయో గపడేలా ఏర్పాటు చేసిన మంచినీటి కొళాయిని కందుల నాగరాజు ప్రారంభిం చారు.

ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ వేసవిలో ప్రజలకు మంచినీటి కొరత లేకుండా జీవీఎంసీ ఆధ్వర్యంలో నూతన కోళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.త్వరలో వార్డు ప్రజలకు చల్లటి మంచినీరు అందుబాటులో ఉంచేందుకు ఫ్రిడ్జ్ లు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉత్కల్ యువ సేవా సమాజ్ కమిటీ సభ్యులు రమేష్ పాడి,ప్రవీణ్ మహంతి,సుదర్శన్ పాడి,శంకర్ పాడి, బిల్లు పాండా,వైసీపీ వార్డు ఇంచార్జి కందుల బదరీ నాథ్ పాల్గొన్నారు.

## కళ్యాణ మండపం నిర్మాణానికి అక్రమ మట్టి రవాణా పట్టించుకోని అధికారులు



కాత్రేనికోన(విజయభాను న్యూస్) : కాత్రేనికోన మండలం కందికుప్ప సెంటర్ ప్రక్కనే అక్రమ రవాణా కొనసాగిస్తూ నూతన కళ్యాణమండపం నిర్వహించేం దుకు ఎటు వంటి అనుమతులు లేకుండా తమ హవా కొనసాగిస్తున్నారు అక్రమార్కులు .కంది గొప్ప సెంటర్ ప్రక్కన లోతట్టు ప్రాంతంలో ఉన్నటువంటి పల్లపు భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా ప్రక్క ప్రాంతం నుండి మట్టిని తరలించి లేఅవుట్ గా మార్చి కల్యాణ మండపం నిర్మాణం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం రాత్రి పగలు అక్రమ రవాణా యధావిధిగా కొనసాగు తుంది. 1000 కొట్టు కళ్యాణ మండపం కట్టు అన్న చందంగా అక్రమ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. .ఈ విషయమై స్థానిక విలేజ్ రెవెన్యూ అధికారి ను వివరణ కోరగా హైదరాబాద్ ప్రాంతం నుండి వచ్చి న వారు ఈ మట్టి తవ్వకాలు జరుపుతున్నారని వివరణ ఇచ్చారు .స్థానిక పేదవారు ఒక స్థలములో మట్టి తరలించి పూరి గుడిసె వేసుకునేందుకు అనుమతులు ఇవ్వని ఈ అధికారులు హైదరాబాద్ నుంచి వచ్చిన వారికి లక్షల్లో కళ్యాణ మండపాలు నిర్మించు కునే వారికి అక్రమ మట్టి తవ్వకాలు జరుపు తుంటే కనీసం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

## మనస్థాపంతో సముద్రంలో దూకి వ్యక్తి మృతి

భీమునిపట్నం(విజయభాను న్యూస్) :: మనస్థాపంతో వ్యక్తి సముద్రంలో మునిగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భీమిలి లో .జరిగింది . స్థానిక రొట్టెల వీధి. ప్రాంతానికి చెందిన దాసరి వెంకటేష్(57) మనస్థాపంతో శుక్రవారం తెల్లవారుజామున సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు చూసి అతనని ఎంత వెదికనను ప్రయోజనం లేకపోయింది. గత్యంతరం లేక పోలీసులుకు ఫిర్యాదు చేసారు. దాంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే సరికి అప్పటికే మృతదేహం సముద్రం ఒడ్డుకు చేరుకుంది. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహంను భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నీటివనరులను సంరక్షించుకోవాలి

- స్వచ్ఛభారత్‌లో భాగం కావాలి -తడిచెత్త పొడిచెత్తలను వేరుచేయాలి
- అవగాహన కల్పించిన ఏయూ జాతీయ సేవా పథకం విద్యార్థులు

ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని ఏయూ జాతీయ సేవా పథకం విద్యార్థులు నినదించారు. శుక్రవారం ఏయూ ఐఏఎస్ఇ కి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీగా పరిపాలనా భవనం వరకు వచ్చారు. నీటి సంరక్షణ, జలశక్తి అభియాన్, స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షన్ ప్రాధాన్యతలను వివరిస్తూ, ప్లకార్డులతో ర్యాలీ జరిపారు. అనంతరం ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వద్ద వీధినాటికను ప్రదర్శించారు. పొడిచెత్త, తడిచెత్త వేరుచేసి అందించాలనే సందేశాన్ని వీధినాటిక రూపంలో ప్రదర్శించారు. విద్యావంతులైన నగర ప్రజలు సైతం వ్యర్థాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలను,

దేశాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రారంభించిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. నీటి సంరక్షణ బాధ్యతను చాటిచెప్పే విధంగా నినాదాలు ఇచ్చారు.

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఐఏఎస్ఇ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, డాక్టర్ నాగరాజ కుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రసన్న, ఐఏఎస్ఇ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యులుగా వేణుంబాక విజయసాయిరెడ్డిని రెండవ సారి నియమించినందుకు తాడేపల్లి లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన రాష్ట్ర పశుసంవర్ధక పాడిపరిశ్రమాభివృద్ధి మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు, కాకినాడ ఇంచార్జి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

## విజయసాయిరెడ్డి ను కలిసిన
## జీసీసీ చైర్ పర్సన్ స్వాతీరాణి



అనంతగిరి( విజయభాను న్యూస్) : విజయవాడ ఉండవల్లిలో గౌరవ పెద్దలు విజయసాయి రెడ్డి క్యాంపు కార్యాలయంలోరెండవ సారి రాజ్యసభ సభ్యుడిగాలి ఎన్నికైన సందర్భంగా విజయసాయి రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ...గిరిజన సహకార సంస్థ చైర్ పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి.



రెండోసారి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన విజయ సాయిరెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసిన శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి.

# ఆకర్షణీయంగా ప్రపంచ సుందరి ఐశ్వర్య



న్యూఢిల్లీ : ప్రపంచ సుందరి ఐశ్వర్యా బచ్చన్ బ్లాక్ గౌన్‌లో మరింత ఆకర్షణీయంగా కనిపించారు. ప్రతి ఏడాదిలాగే.. ఈ ఏడాది కూడా తను వేసుకున్న డ్రెస్‌తో అందరినీ మెస్మరైజ్ చేశారు. ఈ సంవత్సరం జరుగుతున్న 75వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెడ్ కార్పెట్‌పై ఐశ్వర్య బ్లాక్ గౌన్‌లో కనిపించారు. ఈ గౌన్‌కి ఒకవైపు 3డి ఫ్లవర్స్‌తో ఉండడం వల్ల తన ఒంటిని పూలు అల్లుకున్నట్లుగా ఉంది. ఇక ఆ గౌన్‌కి తగ్గట్టుగా మేకప్.. హెయిర్‌ని సింపుల్‌గా వదిలేయడం..చూసినవారు చూపుతిప్పుకోనివ్వలేదంటే ఆశ్చర్యం లేదు.



కాగా, ఆమె కేన్స్ ఉత్సవాల్లో రెండు సంవత్సరాల క్రితం వేసుకున్న డ్రెస్సులు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇప్పుడు నెట్టింట్లో ఆమె గతంలో వేసుకున్న గోల్డ్ కలర్, తెలుపు రంగు గౌను ధరించిన ఫొటోస్ హల్‌చల్ చేస్తున్నాయి.

# నేను నటించిన సినిమాలలో ‘ఆ ఒకటి’ నాకే నచ్చదు - తమన్నా



ప్రస్తుతం 75వ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ఇండియా తరపున పాల్గొంటున్న సెలెబ్రిటీలలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా ఒకరు. ఇండియన్ డెలిగేషన్ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ హిందీ చిత్రపరిశ్రమలో తాను వేసిన తప్పటడుగుల గురించి వ్యాఖ్యానించింది. 2013లో అజయ్ దేవగణ్ హీరోగా నటించిన హిమ్మత్ వాలా చిత్రాల్లో తమన్నా హీరోయిన్ గా నటించింది. ఈ చిత్రమే ఆమెకు తొలి హిందీ చిత్రం. 1983లో వచ్చిన క్లాసిక్ మూవీ హిమ్మత్ వాలా కు మోడరన్ రీమేక్ ఈ సినిమా. పాత సినిమాలో జితేంద్ర, శ్రీదేవి జంటగా నటించగా ఆ సినిమా సూపర్ హిట్ అయ్యింది. కొత్తగా తీసిన హిమ్మత్ వాలా చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద భారీడిజాస్టర్ గా నిలిచింది. కనీసం రూ. 50కోట్లు కూడా ఆ సినిమా కలెక్ట్ చెయ్యలేకపోయింది. ఈ విషయంపై తమన్నా తన స్పందనను తెలియచేసింది. “నా కెరీర్ లో ఉత్తమమైన నిర్ణయాలను , చెత్త నిర్ణయాలను తీసుకున్నాను. ఆ సమయంలో నేను తీసుకున్న నిర్ణయం సరైనదని అనిపించి తీసుకున్నాను. బాహుబలి సినిమాపై ఎంత నమ్మకముంచి చేసానో హిమ్మత్ వాలా కూడా అలానే చేశాను. ఫ్రాంక్ గా చెప్పాలంటే, హిమ్మత్ వాలా సినిమా నాకే నచ్చదు. అయితే, బాహుబలి విజయంతో పొంగిపోలేదు, హిమ్మత్ వాలా పరాజయంతో కృంగిపోలేదు. నటిగా నా పని చేసుకుంటూ వెళ్ళానంతే. కళారంగంలో ఉన్నాక రోజు రోజుకూ ఎంతోకొంత అభివృద్ధి చెందుతూ ఉండాలి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉండకూడదు కదా. ఇప్పుడు నేను కూడా ఎంతో పరిణతి సాధించాను. బాహుబలి, హిమ్మత్ వాలా సమయంలో ఉన్న తమన్నా ను కాదు” ... అంటూ తమన్నా చెప్పుకొచ్చింది.

# ప్లేఆఫ్స్‌కు లక్నో

## రసవత్తర పోరులో 2 పరుగుల తేడాతో కోల్‌కతాపై విజయం




ముంబాయి : హెూరా హెూరీ పోరులో లక్నోనిలిచింది. బుధవారం 2 పరుగుల తేడాతో కోల్‌కతాపై విజయం సాధించింది. ‘మ్యాన్ ఆ ద మ్యాచ్’ డికాక్ (140 నాటౌట్‌బీ 70 బంతుల్లో 104, 10 ఇ% 6), కేఎల్ రాహుల్ (68 నాటౌట్ 51 బంతుల్లో 3 %4, 4 6) రికార్డుల మోత మోగించడంతో మొదట లక్నోఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 210 పరుగులు చేసింది. ఛేదనలో కోల్‌కతా అద్భుతంగా పోరాడింది. శ్రేయస్ అయ్యర్ (50 29 బంతుల్లో 4 4, 3 శ 6) రింకూ సింగ్ (40 15 బంతుల్లో 2%ఇ 4, 4 6), నితీశ్ రాణా (42 22 బంతుల్లో 9 4), బిల్లింగ్స్ (36 24 బంతుల్లో 2 %ఇ4, 3 ఇ%6), నరైన్ (21 నాటౌట్ 7 బంతుల్లో 3 6) మెరవడంతో 8 వికెట్లకు 208 పరుగులు చేసింది. మోసిన్ ఖాన్ (3/20), స్టొయినిస్ (3/23) కోల్‌కతా జట్టును దెబ్బతీశారు.

# బాలకృష్ణతో చంద్రిక ప్రత్యేక గీతం



నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ‘ఎన్‌బికె 107’ వర్కింగ్ టైటిల్‌తో ఓ మాస్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోందన్న విషయం తెలిసిందే. వాస్తవిక కథాంశాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాట కోసం చిత్రబృందం ఇండో ఆస్ట్రేలియా నటి చంద్రిక రవిని ఎంపిక చేసింది. ఎన్‌బికె 107లో భాగం కావడం ఎంతో ఆనందంగా ఉందంటూ చంద్రిక తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పాట చిత్రీకరణ హైదరాబాద్‌లో, కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సారథ్యంలో జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మితమవుతున్న ఈ సినిమాలో శ్రుతిహాసన్ కథానాయికగా నటిస్తున్నారు.


# ఆ గొంతులో ఏదో మ్యాజిక్... మరేదో మాయ!

## సిద్ శ్రీరామ్..



సిద్ శ్రీరామ్.. ఈ పేరు వింటే చాలు సినీ సంగీతాభిమానులు అద్భుతమైన సంగీత లోకం లోకి వెళ్లిపోతారు. అద్భుతమైన గొంతు, అంతకు మించిన శాస్త్రీయ పరిజ్ఞానం సిద్ శ్రీరామ్‌ను ఈ డికేడ్ సింగర్‌గా మార్చివేసింది. పొద్దున్నే సిద్ శ్రీరామ్ పాట వింటే చాలు.. ఆ పరిమళం, మోహం ఆ రోజంతా వెంటాడుతుంది. ఎన్ని సార్లు విన్నా కొత్తగా అనిపిస్తుంది..దటీజ్ వెర్సటైల్ సింగర్ సిద్ శ్రీరామ్ మ్యాజిక్. సిద్ శ్రీరామ్ మెలోడియస్‌గా, రొమాంటిక్‌గా ఒక పాట పాడితే చాలు ఆ సినిమా హిట్ గ్యారంటీ అన్న రేంజ్‌లో సిద్ హవా నడుస్తోంది. శ్రీరామ్ తమిళనాడులోని చెన్నైలో జన్మించాడు. తండ్రి శ్రీరాం వ్యాపారవేత్త. తల్లి లత సంగీతం టీచర్. ఇంట్లోనే సంగీత నేపథ్యం ఉండటంతో సహజంగానే సిద్ కు సంగీతం ఆసక్తి ఏర్పడింది. తొలి గురువు అమ్మ ద్వారా కర్ణాటక సంగీతంలో మరింత రాణించాడు. తల్లిదండ్రులతో కలసి కాలిఫోర్నియాకు వెళ్లిన సిద్ బెర్క్లీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో చేరాడు. మ్యూజిక్ ప్రొడక్షన్, ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడయ్యాడు. కర్ణాటక కచేరీలను కూడా నిర్వహించేవాడు. సిద్ చెల్లెలు పల్లవి శ్రీరాం భరతనాట్య కళాకారిణి కావడం విశేషం.

# పూర్ణ లేటెస్ట్ స్టిల్స్



పూర్ణగా ప్రసిద్ధి చెందిన షమ్నా కాసిమ్ మే 23, 1989న కేరళలోని కన్నూర్‌లో జన్మించారు. ఆమె భారతీయ నటి, ప్రముఖ నర్తకి మరియు మోడల్. ఆమె 2004లో మంజుపోలోరు పెంకుట్టితో మలయాళ చిత్రరంగ ప్రవేశం చేసింది.పూర్ణ యొక్క మొదటి తెలుగు చిత్రం శ్రీ మహాలక్ష్మి 2007లో విడుదలైంది మరియు ఆమె కన్నడ తొలి చిత్రం జోష్ 2009లో విడుదలైంది. మునియాండి జువాలజీ మూడవ సంవత్సరం చిత్రంతో తమిళంలో అడుగుపెట్టిన నటి పూర్ణ, ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 13 లక్షలకు పైగా ఫాలోవర్స్ కలిగి ఉన్నారు.

# తప్పు చేస్తే రోడ్డు మీద నిలబెట్టి కొట్టండి అంతేకానీ..



జీవితా రాజశేఖర్ దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా నటించిన చిత్రం ‘శేఖర్’. బీరం సుధాకర్‌రెడ్డి, శివానీ రాజశేఖర్, శివాత్మికా రాజశేఖర్, వెంకట శ్రీనివాస్ బొగ్గరం నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమాను ముత్యాల రాందాస్ ఈ నెల 20న రిలీజ్ చేస్తున్నారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చేప్టటిన ఓ ఈవెంట్‌లో జీవిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. తమ కులాన్ని కించపరిచిందంటూ ఓ వర్గం ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పింది. తను ఒకలాగా అంటే అది ఇంకో ఉద్దేశంలో ప్రచారం చేస్తున్నారని, ఏదేమైనా మనసులను నొప్పించి ఉంటే క్షమించాలని కోరింది. అదే సమయంలో తమ కుటుంబం గురించి లేనిపోని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడింది జీవిత.

గురువారం నాడు ఏర్పాటు చేసిన తెలుగు ఫిలిం ఇండస్ట్రీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ‘నా మీద వచ్చినన్ని వార్తలు వేరేవాళ్లమీద బహుశా రావేమో. మొన్నా మధ్య నా కూతురు బాయ్‌ఫ్రెండ్‌తో దుబాయ్‌కు వెళ్లిందని దుష్ప్రచారం చేశారు. ఓసారి శివాత్మిక అంటారు, కాదు శివానీ ప్రియుడితో పారిపోయిందంటారు. తీరా వార్త ఓపెన్ చేస్తే ఆ శీర్షికకు, లోపల రాసున్నదానికి సంబంధమే ఉండదు. మా ఫ్యామిలీ అంతా కలిసి దుబాయ్‌కు వెళ్లాం. దానికే ప్రియుడితో దుబాయ్‌కు లేచిపోయారని వార్తలు రాశారు. ఇలా అసత్యాలు ప్రచారం చేస్తే ఎంతో మంది జీవితాలు ప్రభావితం అవుతాయి. గరుడ వేగ సినిమా వివాదం కోర్టులో ఉంది. కోర్టులో తేలకముందే ఏదేదో చెబుతున్నారు. నిజంగా తప్పు చేశామంటే రోడ్డు మీద నిలబెట్టి కొట్టండి, ఎవరమూ కాదనం. కానీ తప్పొప్పులు తెలుసుకోకుండా అసత్యాన్ని ప్రచారం చేయకండి’ అని సూచించింది.



# జపాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆరు అవార్డులు దక్కించుకున్న సూర్య చిత్రం



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన ‘సూరరైపోట్రు’ చిత్రం ఎంతటి ఘన విజయాన్ని సొంతం చేసుకున్నదో అందరికీ తెలిసిన విషయమే. ఈ చిత్రమే తెలుగులో ‘ఆకాశమే నీ హద్దురా’ టైటిల్‌తో విడుదలైంది. డెక్కన్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు గోపీనాథ్ జీవిత కథ ఆధారంగా మహిళా డైరెక్టర్ సుధా కొంగర ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో, పలు విభాగాల్లో అవార్డులను గెలుచుకున్న ఈ చిత్రం మరోసారి అవార్డుల్ని గెలుచుకుంది. తాజాగా జపాన్‌లో జరిగిన ఒసాకా తమిళ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏకంగా ఆరు విభాగాల్లో అవార్డులను గెలుచుకుంది. ఇక ఈ అవార్డుల్లో ఉత్తమ నటుడిగా సూర్య, ఉత్తమ దర్శకురాలిగా సుధా కొంగర, ఉత్తమ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్, 2020 సంవత్సరానికి ఉత్తమ చిత్రంగా ‘సూరరైపోట్రు’, ఉత్తమ నిర్మాణ సంస్థగా 2డి ఎంటర్‌టైన్మెంట్, ఉత్తమ ఆర్ట్ డైరెక్టరుగా జాకీ అవార్డులను గెలుచుకున్నారు.

ఈ చిత్రం కరోనా పరిస్థితుల్లో మొదట ఓటీటీ ఫ్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైంది. ఆ తర్వాత థియేటర్లలోనూ విడుదలై బాక్సాఫీస్ వద్ద బంపర్ హిట్ కొట్టింది.



# సాధారణ ధరలకే ‘ఎఫ్3’ టికెట్లు

ఈ మధ్య కాలంలో విడుదలవుతున్న ప్రతి సినిమాకు టికెట్ రేట్లను అమాంతం పెంచేస్తున్న విషయం తెలిసిందే! అయితే తమ సినిమాకు అలాంటి పరిస్థితి ఉండదని నిర్మాత దిల్‌రాజు తెలిపారు.

# విశాఖ పోర్ట్ అధారిటీ మరో అరుదైన రికార్డు



- ఒక్క రోజులో రికార్డ్ కార్గో హ్యాండ్లిగ్ - నెల రోజుల వ్యవధిలో రెండో మారు రికార్డు
- రెండేళ్లలో నాలుగోసారి రికార్డ్ కార్గో హ్యాండ్లింగ్ ఘనత
- ఈ ఘనత సాధించిన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు
- పోర్ట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలి
- పోర్టు చైర్మన్ కే రామ్మోహన్ రావు అభిలాష



విశాఖపట్నం (విజయభాను న్యూస్): విశాఖపట్నం పోర్ట్ అధారిటీ మరో అరుదైన రికార్డును సాధించింది. ఒకే రోజులో విశాఖపట్నం పోర్ట్ లో అత్యధిక సరుకును హ్యాండిల్ చేసిన ఘనతను సాధించింది. ఈ నెల 19వ తేదీ గురువారం 3,76,460 మెట్రిక్ టన్నుల కార్గోను హ్యాండిల్ చేయడం ద్వారా విశాఖ పట్నం పోర్టు అధారిటీ ఈ ఘనతను సాధించింది. నెల రోజుల వ్యవధిలో పోర్టు ఈ రికార్డును సాధించడం ఇది రెండో సారి కావడం గమనార్హం. 26 ఏప్రిల్ 2022న ఒక్క రోజులో రికార్డు స్థాయిలో విశాఖపట్నం పోర్టు హ్యాండిల్ చేసిన 3,73,544 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా ఇప్పటి వరకూ ఒక్క రోజు రికార్డుగా ఉంది. తాజాగా ఈ రికార్డును పోర్టు నెల రోజుల వ్యవధిలో మరో మారు అధిగమించింది. ఇన్నర్ హార్బర్, అవుటర్ హార్బర్ మరియు ఎస్ పి ఎం ల నుంచి 3,76,460 మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండిల్ చేయడం ద్వారా ఒక్కరోజులో అత్యధిక సరుకును హ్యాండిల్ చేసి రికార్డ్ సృష్టించింది. మే 19న పోర్టు కు వచ్చిన 22 నౌకల ద్వారా ఈ సరుకును హ్యాండిల్ చేశారు. గతంలో 2021లో పోర్టు ఒక్క రోజులో 3,70,029 మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ చేసింది.

అంతకు ముందు 2019 డిసెంబర్ 2 న 19 నౌకల నుంచి 3,47,722 మెట్రిక్ టన్నులు సరుకును హ్యాండిల్ చేసింది. ప్రస్తుతం ఈ రికార్డులను అధిగమించి విశాఖపట్నం పోర్ట్ అధారిటీ నూతన రికార్డును నెలకొల్పింది.

పోర్టు ఈ ఘనతను సాధించడం పట్ల చైర్మన్ కే రామమోహనరావు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘనతను సాధించిన ట్రాఫిక్ డిపార్ట్మెంట్ మేనేజర్ రత్న శేఖర్ ను మరియు ట్రాఫిక్ విభాగం సిబ్బంది ని పోర్టు అధారిటీ చైర్మన్ కె రామమోహనరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించి పోర్టు అభివృద్ధికి నిరంతం కృషి చేయాలని అభిలషించారు. ఈ ఘనతను సాధించిన ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ ను శుక్రవారం జరిగిన ఉన్నత అధికారుల సమావేశం లో పోర్టు చైర్మన్ రామ్మోహనరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, పోర్ట్ సెక్రటరీ వేణుగోపాల్, పోర్టు విభాగాధిపతులు పాల్గొన్నారు.

# తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం టంగుటూరి



అమరావతి (విజయభాను న్యూస్) : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి నేడు(మే 20). ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు నివాళులు అర్పించారు. 'తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజల మనసులో చిరస్మరణీయంగా నిలిచిన ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా ఘన నివాళి. ఆయన త్యాగం, సాహసం భావితరాలకు ఆదర్శం' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు. తెలుగువారి తెగువకు నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజల మనసులో చిరస్మరణీయంగా నిలిచిన ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా ఘన నివాళి. ఆయన త్యాగం, సాహసం భావితరాలకు ఆదర్శం.

# ప్రతి 2వేల జనాభాకు ఒక వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్

## రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు




అమరావతి: బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవదానానికి వారి కుటుంబసభ్యులను మానసికంగా సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. ఒక బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు 8 మందికి అమర్చే అవకాశముందన్నారు. మంగళగిరి లోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో నిర్వహించిన జీవన్‌దాన్ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాన్స్ ప్లాంట్ కో-ఆర్డినేటర్లుగా శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. అవయవదానంపై ట్రాన్స్ ప్లాంట్ కో-ఆర్డినేటర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబసభ్యులకు ఓపిగ్గా కౌన్సెలింగ్ నిర్వహించి వారి కుటుంబసభ్యులను ఒప్పించాలని స్పష్టం చేశారు. జీవన్ దాన్ కార్యక్రమం కింద హార్వెస్టెడ్ ఆర్గాన్స్ అన్నింటినీ ఏపీ ప్రజల అవసరాలకు మాత్రమే వినియోగించాలని కృష్ణబాబు సూచించారు. రాష్ట్రంలో 16 కొత్త మెడికల్ కళాశాలలతోపాటు మరో 16 మల్టీస్పెషాలిటీ హెల్త్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హెల్త్ హబ్‌లకు ప్రభుత్వం ఉచితంగా భూమిని కేటాయిస్తోందన్నారు. వైద్య, ఆరోగ్య రంగానికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రతీ 2వేల జనాభాకు ఒక వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ అందుబుటో ఉండేలా రాష్ట్రంలో 10వేలకు పైగా వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో వైద్యారోగ్య రంగంలో ఆంధ్రప్రదేశ్ పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కలిగి ఉంటుందని కృష్ణబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశాఖ విమానాశ్రయంలో నారా లోకేష్ కు ఘనస్వాగతం

## - సంపంగి మాలతో సత్కరించి సింహాద్రి అప్పన్న చిత్ర పట్టాన్ని బహుకరణ



విశాఖపట్నం (విజయభాను న్యూస్): విజయనగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేం దుకు విచ్చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుకు విశాఖ విమానాశ్రయంలో విశాఖ పార్లమెంటరీ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సంపంగి మాలతో సత్కరించి సింహాద్రి అప్పన్న చిత్ర పట్టాన్ని బహుకరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయ ణమూర్తి, కోండ్రు మురళి, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు,పి జి వి ఆర్ నాయుడు (గణబాబు), మాజీ శాసనసభ్యులు దక్షిణం నియోజకవర్గ ఇంచార్జ్ గండి బాబ్జి, భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, ఆదిరెడ్డి వాసు, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్య బాబు, ప్రగాఢ నాగేశ్వర రావు, లాలం భాస్కరరావు, గవిరెడ్డి రామానాయుడు, పుచ్చ విజయ్ కుమార్, పి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించండి.. లేదంటే భారత్ నుంచి వెళ్లిపోండి

## వీపీఎన్ సర్వీస్ ప్రొవైడర్లకు కేంద్ర ఐటీశాఖ స్పష్టం

దిల్లీ: భారత్ రూపొందించిన ఐటీ నిబంధనలకు అనుగుణంగా ఆయా సంస్థలు నడుచుకోవాల్సిందేనని కేంద్ర ఐటీశాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఒకవేళ వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ సర్వీస్ ప్రొవైడర్లు లేదా ఇతర వీపీఎన్ సర్వీస్ ప్రొవైడర్లు నూతన మార్గదర్శకాలను పాటించకుంటే దేశం నుంచి నిష్క్రమించడం తప్ప వారికి మరోమార్గం లేదని తేల్చిచెప్పారు. సైబర్ ఉల్లంఘనల నమోదుపై ఇటీవల రూపొందించిన మార్గదర్శకాలపై తరచూ అడిగే ప్రశ్నలను విడుదల చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి ఈ విధంగా స్పందించారు.'భారత్‌లో నిబంధనలు, చట్టాలను పాటించలేమని చెప్పడానికి ఎవ్వరికీ అవకాశం లేదు. ఇప్పటివరకు లాగ్ రికార్డులు లేకుంటే.. వాటిని ఇకనుంచి మొదలుపెట్టండి. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మార్గదర్శకాలు పాటించలేమని కోరుకునేవారు ఒకవేళ భారత్ నుంచి వెళ్లిపోవాలనుకుంటే నిరభ్యంతరంగా నిష్క్రమించవచ్చు' అని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ నిబంధనల్లో ప్రభుత్వం ఎటువంటి మార్పుచేయదని స్పష్టం చేశారు.

# గీతం ప్రవేశపరీక్ష "గ్యాట్" నిర్వహణ



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజ నీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2022) ను శుక్రవారం గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ ప్రారంభిం చారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహి స్తున్నారు. ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెల్లడించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామని తెలిపారు. గీతం విద్యార్థులలో నైపుణ్యం పెంచడంతో పాటు ఉద్యోగ అవకాశాలను మెరుగు పరచడానికి, విదేశీ విద్య అవకాశాలను పెంచుకోవడానికి, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తగిన శిక్షణ అందించేందుకు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను (జిసిజిసి)ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, అడ్మిషన్ల డైరక్టర్ శేఖర్, ఇతర అధికార్లు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్ కొరకు జిల్లాలో

# సరిపడా విత్తనాలు, ఎరువులు సమకూర్చడం జరిగింది

## జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఖరీఫ్ సీజన్ కొరకు జిల్లాలో సరిపడా విత్తనాలు, ఎరువులు సమకూర్చడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్ తెలియజేసారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా విభజన తరువాత నూతనంగా ఏర్పడిన విశాఖపట్నం జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు మండలాలు మాత్రమే వ్యవసాయ పరిధిలో ఉన్నాయని, రైతు సమస్యలను పరిష్కరించడం సులభతరమైనదని అన్నారు. రైతు భరోసా కేంద్రాలు, మండల కేంద్రాలలో రైతులు లేవనెత్తిన సమస్యలను జిల్లా స్థాయి సమావేశంలో పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. జిల్లాలో అన్ని రిజర్వాయర్లు నిండుగా ఉన్నాయని, ఋతుపవనాలు కూడా ముందుగా రానున్నందున విత్తన నాట్లు సమయం పై రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. డి.వి.ఎ. ప్రసాద్ రాజు, చైర్మన్ జిల్లా వ్యవసాయ సలహామండలి మాట్లాడుతూ వ్యవసాయం లాభదాయకంగా లేదని పెట్టుబడులు పెరిగాయని జాతీయ ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ పనులను అనుసంధానం చేసినట్లయితే రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సలహామండలి సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు విత్తన ధాన్యం మార్చుట వలన రైతులకు ఇబ్బందులు కలుగుతాయని తెలియజేసారు. రైతులకు వ్యవసాయం పై కొత్త ఆలోచనలతో అవగాహన కల్పించాలని, నూతన పనిముట్లను సమకూర్చినట్లయితే బాగుండునని తెలియజేసారు. అదే విదంగా బిందు సేద్యం పరికరాలు గత కొంతకాలంగా సరపరా లేదని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జె.డి మత్స్యశాఖ ఎస్.గోవిందరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జె.శైలజ, జె.డి పశుసంవర్ధక శాఖ డాక్టర్ డి.రామకృష్ణ, ఎ.డి. మార్కెటింగ్ ఎం .కాళేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ సిబ్బంది, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com